ఎన్ఎన్ఆర్‌జీ అధ్యాపకురాలు శాంతిప్రియకు డాక్టరేట్



పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహ రెడ్డి కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పి.శాంతిప్రియకు డాక్టరేట్ డిగ్రీని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రదానం చేసింది. ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ డా.ఎస్. నాగ మల్లేశ్వరరావు పర్యవేక్షణలో ×జెనరేటింగ్ ట్రావెల్ రికమండేషన్స్ విత్ హైబ్రిడ్ ఫిల్టరింగ్ అండ్ పీఎస్ఓ–ఏసీఓ ఆప్టిమైజేషన్¤ అనే అంశంపై శాంతిప్రియ చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా లభించింది. ఈ సందర్భంగా శాంతిప్రియను ఎన్ఎన్ఆర్‌జీ డైరెక్టర్ డాక్టర్ సీ.వీ.కృష్ణారెడ్డి, హెచ్‌ఓడీ ఆఫ్ సీఎస్ఈ డాక్టర్ కే.రామేశ్వరయ్య, అధ్యాపక బృందం మంగళవారం అభినందించారు.

వీడ్కోలు సత్కారం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తించి జడ్చర్లకు బదిలీ అయిన బాసిత్‌ను అన్నదాతలు, వ్యవసాయాధికారులు మంగళవారం సత్కరించారు. ఎదులాబాద్ రైతు వేదికలో వీడ్కోలు సమావేశం నిర్వహించి సన్మానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లావణ్య, సహాయకుడు జగదీశ్, రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అన్నదాతలు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

25 ఏళ్ల తర్వాత కలిశారు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కీసర: కీసర జిల్లా పరిషత్ హైస్కూల్ 2000–01 బ్యాచ్ పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం కీసరలో నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు.

47,867 మందిని అక్షరాస్యులను చేయడమే లక్ష్యం

జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

సాక్షి, సిటీబ్యూరో: నూతన విద్యావిధానం –2010 అమలులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించినట్లుగా 2025–26 సంవత్సరంలో 47,867 మంది చదువురాని వారిని అక్షరాస్యులుగా చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) ఐ.విజయకుమారి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో న్యూఇండియా లిటరసీ ప్రోగ్రాం కింద ఎంఈఓలు, సెర్ప్ ఫీల్డ్ సిబ్బంది, సీసీలు, వీఓఏలకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావుతో కలిసి ఆమె మాట్లాడారు. నూతన విద్యావిధానంలో భాగంగా మొదటి దశలో 2022–27 వరకు కోటి మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్‌ను రూపొందించారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా స్వచ్ఛంద వలంటీర్ల ద్వారా మ్యాచింగ్, లెర్నర్స్ గుర్తించి ఒక్కొక్కరు 10మంది, అంతకంటే తక్కువ చదువురాని వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు మాట్లాడుతూ వయోజన విద్య కార్యక్రమ నిర్వాహణకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు సమకూర్చేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వయోజన విద్య ఈఈ నాగలక్ష్మి, సంబంధిత డైరెక్టర్లు క్రిష్ణ, సురేందర్‌బాబు, ప్రాజెక్టు ఇన్‌చార్జ్ అనిత, ఏపీఓ శ్రీనివాస్‌బాబు, డీపీఆర్‌ఓ స్వర్ణలత పాల్గొన్నారు.

క్రీడా అకాడమీ వసతి గృహాల్లో ప్రవేశాలకు ఎంపిక

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) ఆధ్వర్యంలోని వివిధ క్రీడా అకాడమీ, వసతి గృహాలలో ప్రవేశాలకు ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టినట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యువజన, క్రీడల అధికారి జీవీ గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సంస్థ 2025–26 సంవత్సరానికి గాను ఎనిమిది రీజినల్ స్పోర్ట్స్ వసతి గృహాలు, అకాడమీలలో మంజూరైన ఖాళీలను భర్తీ చేసేందుకు క్రీడల ఎంపిక పోటీలను జూన్ 1, 13వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సంబంధిత అకాడమీలలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అర్హులైన, ఆసక్తి గల బాలురు, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్: 76609 19518.

మొర ఆలకించరేమీ..?

ఓ కాలనీ కన్నీటి కథ

- 20 ఏళ్లు గడిచినా అదే దుస్థితి
- వర్షం వస్తే మోకాల్లోతు నీరు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

కాలనీ అంటే పేర్చినట్టుండే ఇళ్ల వరుస, వెడల్పయిన రోడ్లు, చక్కని కాల్వల వ్యవస్థ.. ఇలా అన్ని సదుపాయాలు ఉంటాయని ఊహించుకుంటాం. అయితే రాష్ట్రంలోనే పెద్ద కార్పొరేషన్‌గా పేరు గాంచిన జవహర్‌నగర్‌లోని వెంకటేశ్వర కాలనీని చూస్తే ఇందుకు విరుద్ధంగా ఉంటుంది. అదీ వర్షం పడిన సమయంలో చూస్తే పొరపాటున చెరువులో కాలనీ ఏర్పాటు చేశారనుకుంటాం. చిన్న వర్షానికే కాలనీల రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో నిత్యం నరకం అనుభవించే కాలనీ వాసుల దుస్థితి ఇదీ.. – జవహర్‌నగర్



గతేడాది కురిసిన వర్షానికి చెరువును తలపిస్తున్న వెంకటేశ్వరకాలనీ



వర్షపునీరు, మురుగునీటిలో అవస్థలు పడుతున్న చిన్నారులు

కాలనీకి వెళ్లేందుకు దారి కూడా లేదు. కాల్వలు లేక వాడుక నీరు వీధుల్లోనే నిలిచిపోతోంది. దీంతో ఎక్కడికక్కడి మురికి కూపాలు తయారై అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారు. చిన్న వర్షం కురిస్తే చాలు వీధులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఇంట్లో నుంచి ఆరు బయట అడుగు పెట్టలేని దుస్థితి. అత్యవసర సమయంలో బయటకు వెళ్లాలంటే మోకాలి లోతు నీటిలో పడుతూ, లేస్తూ వెళ్లాల్సిందే.. వర్షం పడిన వారం రోజుల వరకు పరిస్థితి ఇదే. ఆ తర్వాత నీరు పోయినా మరో 15 రోజులు బురదలో తిరగాల్సి ఉంటుంది. పిల్లలు పాఠశాలలకు వెళ్లలేక చదువుకు స్వస్తి చెబుతున్నారు. తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. విద్యుత్ వైర్లు సరిగా లేక ప్రతి రాత్రి చీకట్లో గడపాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలైట్లు వేసినా వైర్లు సక్రమంగా లేకపోవడంతో బల్బులు కాలిపోతున్నాయని వారు అంటున్నారు.

అప్పటికీ.. ఇప్పటికీ ఏ మార్పు లేదు

ఇరవై ఏళ్ల క్రితం ఈ కాలనీని ఏర్పాటు చేశారు. మొత్తం 800 ఇళ్లు ఉండగా 7వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం ఈ కాలనీ ఎలా ఉండేదో.. ఇప్పుడు అదే అలాగే ఉందని స్థానికులు చెబుతున్నారు. భారీ వర్షం కురిస్తే ఇళ్లు చెరువులో ఉన్నట్లు కనిపిస్తాయని అన్నారు. ఈ విషయమై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రతి సంవత్సరం మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మా కాలనీపై దృష్టి సారించాలి



హాయిగా ఇంట్లో ఉండి సేద తీరాలనుకుని ఇళ్లు కట్టుకున్నాం. కానీ వర్షం పడితే చాలు నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. ఎన్నాళ్లు కష్టాలు పడాలో తెలియడం లేదు. ప్రతినిత్యం అనుభవించే బాధలను స్వయంగా పరిశీలిస్తే మా దుస్థితి మీకే తెలుస్తుంది. అధికారులు, నాయకులు తక్షణం చర్యలు తీసుకుని మా కాలనీపై దృష్టి సారించాలి.

– సూర్యలక్ష్మి, వెంకటేశ్వరకాలనీ, జవహర్‌నగర్

మౌలిక సదుపాయాలు కల్పించండి



కాలనీలో సరైన రోడ్లు, కాల్వలు లేవు. తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బోరు నీరు తప్ప మంచినీరు లేదు. అధికారులు స్పందించి వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా చూడాలి. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు, పాలకులు అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

– రంగుల శంకర్‌నేత, బీజేపీ రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి

దశలవారీగా పరిష్కరిస్తాం..



జవహర్‌నగర్ చాలా పెద్ద కార్పొరేషన్.. ఎన్ని నిధులు వెచ్చించినా సరిపోవడంలేదు. చాలా సమస్యలు ఉన్నాయి. దాదాపు అన్ని ప్రధాన రహదారులలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచాం. ఇంకా కొన్ని కాలనీలలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ లైన్ వేయాల్సి ఉంది. ఇక్కడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అధిక నిధులు తీసుకువచ్చి చర్యలు తీసుకుంటాం.

– వసంత, కమిషనర్ జవహర్‌నగర్ కార్పొరేషన్

కోతుల సమస్య పరిష్కరించాలని వినతి



మున్సిపల్ కార్యాలయంలో వినతి అందజేస్తున్న ఎదులాబాద్ వాసులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో కోతుల సమస్య పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో స్థానికులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కోతులు ఎక్కువై ఇళ్లలోకి వచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని లేఖలో కోరారు. చిన్న పిల్లలను బయటకు పంపించాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందని, పాదచారులపై, ద్విచక్ర వాహనాలపై దాడి చేస్తున్నాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశైలం, వెంకటేశం, కుమారస్వామి, శ్రీనివాస్, రాజయ్య, శ్రావణ్, హరి పాల్గొన్నారు.

గోధుమకుంటలో ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’

కీసర: కీసర మండలంలోని గోధుమకుంటలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ జి.శ్రీదేవి, ప్రొఫెసర్ డాక్టర్ సందీప్‌కుమార్, ఎన్.విక్రమ్, నిహారిక, ఎంఏవో మాధవిలత, ఏఈవో రాజ్‌కుమార్ హాజరయ్యారు. చీడ, పీడ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వాహన తనిఖీ సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి

వాహన తనిఖీ కేంద్రాన్ని సందర్శించిన డీసీపీ కోటిరెడ్డి



మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో సమీక్ష సమావేశంలో డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్‌రూరల్: వాహనాలను తనిఖీ చేసే సమయంలో, పెట్రోలింగ్ సమయంలో సిబ్బంది తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం మేడ్చల్ జోన్ ఏసీపీ శంకర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వాహన తనిఖీ నిర్వహించే సిబ్బంది విధులు, వారి బాధ్యతలు, విధి నిర్వహణలో ఉన్నప్పుడు చేయాల్సిన, చేయకూడని పనులను సిబ్బందికి వివరించారు. ఇటీవల శంషాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెట్రోలింగ్ వాహనం పైకి లారీ దూసుకువచ్చి ఓ కానిస్టేబుల్ ప్రాణాలను కోల్పోగా, మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలైన ఘటన గురించి సిబ్బందికి తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలను పరిశీలించిన ఆయన పెట్రోల్ మొబైల్ యూనిట్లు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం మేడ్చల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంఖ్య, క్రైంరేటు, కేసుల నమోదు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. బక్రీద్ పండగ సమీపిస్తున్నందున పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఐ కృష్ణ ప్రసాద్, ఎస్‌ఐ అశోక్, శ్రీనివాస్, మన్మధ్ రావు, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 11వ వార్డులో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య మంగళవారం పరిశీలించారు. వర్షం నీరు రోడ్డుపై నిలిచి బురదగా మారుతోందని స్థానికులు మాజీ పాలకవర్గాన్ని కోరగా రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించింది. కార్యక్రమంలో మల్లేశ్, దేవేందర్‌ముదిరాజ్, నాగరాజుముదిరాజ్, శ్రీనివాస్, ఖయూమ్, రాజు, స్థానికులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య

ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రత్యేక దృష్టి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వానాకాలం పంటల సాగుపై సంబంధిత అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఎప్పటికప్పుడు సమీక్షలు, పర్యవేక్షణతో ముందుకు వెళ్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం మాట్లాడారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టి, నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించి భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయాలన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు మూడోదశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు చాలా కీలకమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. 29, 30 తేదీల్లో జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు గౌతమ్‌తో సహా జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకంతో డాక్యుమెంట్ చేసుకున్న వ్యక్తిపై కేసు

పోచారం: ఫోర్జరీ సంతకంతో ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. కొర్రెముల్‌లోని ఏకశిలానగర్ వెంచర్‌లో సీతాఫల్‌మండికి చెందిన సీహెచ్ రమణారావుకు 200 చదరపు గజాల ప్లాటు ఉంది. ప్లాటు డాక్యుమెంట్‌ను తనఖా పెట్టి ఎస్.కోటేశ్వరరావు వద్ద రమణారావు కొంత డబ్బు అప్పుగా తీసుకున్నారు. కొద్ది కాలం తర్వాత అప్పు తీర్చినప్పటికీ, అనివార్య కారణాల వల్ల డాక్యుమెంట్‌ను రమణారావు తీసుకోలేదు. ఇదే అదనుగా చేసుకొన్న కోటేశ్వరరావు ఆ ప్లాటును ఫోర్జరీ సంతకంతో తొలుత తన పేరు మీద, తర్వాత తన కూతురు పేరు మీద డాక్యుమెంట్ చేయించుకున్నాడు. ఈ విషయం రమణారావుకు ఆలస్యంగా తెలియడంతో పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాటు కబ్జా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు..

కొత్తపేటకు చెందిన లింగస్వామికి కొర్రెముల్‌లోని సర్వే నంబర్లు 710, 711లో 100 చదరపు గజాల ప్లాటు ఉంది. దీని చుట్టూ బేస్‌మెంట్ కూడా నిర్మించారు. ఇటీవల ఈ ప్లాట్ చుట్టూ ఉన్న బేస్‌మెట్‌ను డేవిడ్‌రెడ్డి అనే వ్యక్తి తొలగించి, తిరిగి కొత్తగా నిర్మించేందుకు చుట్టూ కందకం తవ్వించాడు. ఈ విషయం లింగస్వామికి తెలియడంతో పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కంపెనీ ఎదుట కార్మికుల ఆందోళన



కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

మేడ్చల్‌రూరల్: 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలంటూ మేడ్చల్ మున్సిపాలిటీ పూడూర్ పరిధిలోని టైమ్‌టెక్నో కంపెనీ ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కంపెనీ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ కంపెనీలో కార్మికులు 8 గంటలు కాకుండా 12 గంటలు పనిచేయాలని యాజమాన్యం ఒత్తిడి చేయడం సరికాదన్నారు. కంపెనీలో డ్రమ్ములు తయారవుతున్నందున కార్మికులు వేడి వాతావరణంలో పనిచేయాల్సి ఉంటుందని 12 గంటల పాటు పనిచేస్తే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. యాజమాన్యం పనిగంటల మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరేశ్, కార్మికులు పాల్గొన్నారు.

బైబిల్ శిక్షణ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోచారం: పెంతెకొస్తు మిషన్ ఆధ్వర్యంలో 29వ తేదీ వరకు ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో ప్రత్యేక బైబిల్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కాచవానిసింగారంలో ఫెలోషిప్ చైర్మన్, రాయల్ ప్రీస్ట్‌హుడ్ బిషప్ వీరాజీ ఘంటా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ సాయంత్రం 6 గంటలకు బైబిల్ స్టడీ ఉంటుందని చెప్పారు. భోజన వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. ది పెంతెకొస్తు మిషన్ చర్చి సెంటర్ పాస్టర్ లూకాస్, బ్రదర్ శ్యాంపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమలతకు ఓయూ డాక్టరేట్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హబ్సిగూడకు చెందిన ఎం.ప్రేమలత ప్రభాకర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) అవార్డు ప్రదానం చేసింది. శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీ కేంద్రీయ విద్యాలయంలో పీజీటీగా పనిచేస్తున్న ప్రేమలత..ఓయూకు చెందిన డాక్టర్ దుర్గేశం పర్యవేక్షణలో ‘సెకండరీ స్థాయిలో ఇంగ్లిషు భాష బోధన పద్ధతులు’ అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు.

‘ప్రగతి చక్రం’ పురస్కారాల అందజేత



పురస్కారాలతో ఆర్టీసీ శ్రామికులు

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపో పరిధిలో ఏప్రిల్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం ప్రగతి చక్రాల పురస్కారాలను అందజేసింది. డిపోలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎం సుధాకర్ కార్మికులను శాలువాలతో సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. బ్రేక్‌డౌన్ లేకుండా బస్సులు నిర్వహించిన మెకానిక్‌లు, ఇంధనం పొదుపు చేయడంలో నైపుణ్యం చూపిన డ్రైవర్లు, ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లు వంటి వాటిలో ప్రతిభ కనబర్చిన వారికి పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎంలు రామారావు, రజిత, ఏఈ జ్ఞానేశ్వర్, స్నేహలత, సూపరింటెండెంట్ పీఎస్‌రావు తదితరులు పాల్గొన్నారు.